RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

వరంగల్ | శనివారం | పేజీలు : 6 | దినపత్రిక
సంపుటి : 4, సంచిక : 41 | జనవరి 17, 2026 | వెల : రూ.3-00



4లో.. ఆదిలాబాద్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

# 'మత్తు'పడగ!

- ☐ రాష్ట్రంలో విస్తరిస్తున్న గంజాయి మాఫియా
- ☐ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా ఆగని దందా
- ☐ ఇటీవల పట్టుబడ్డ అత్యంత విలువైన హైడ్రోపోనిక్ష సరుకు
- ☐ మరో ఘటనలో భారీగా ఎండు గంజాయి స్వాధీనం
- ☐ ఒడిశా టు మహారాష్ట్ర తీసుకెళ్తుండగా దొరికిన వైనం
- ☐ పలు జిల్లాల్లో పట్టుబడుతున్న అక్రమార్కులు
- ☐ యువతే లక్ష్యంగా రాష్ట్రంలోకి ఎంట్రీ..
- ☐ సాగు తగ్గినా బయటి రాష్ట్రాల నుంచి దిగుమతి
- ☐ సాఫ్ట్ వేర్ ఉద్యోగులు సైతం గంజాయి మత్తుకి బానిస!

3లో.



**వేద న్యూస్, క్రైమ్ బ్యూరో:**

తెలంగాణపై మత్తు మేఘాలు కమ్ముకుంటున్నాయా? రాష్ట్ర పోలీస్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతున్నా, గంజాయి మాఫియా పడగ విప్పుతూనే ఉందా? తాజా పరిణామాలు చూస్తుంటే సమాధానం అవుననే అనిపిస్తోంది. ఒకప్పుడు మారుమూల అడవుల్లో సాగుకు మాత్రమే పరిమితమైన గంజాయి దందా, ఇప్పుడు హైటెక్ హంగులు అద్దుకుంది. ఖతార్ నుంచి ఖరీదైన 'హైడ్రోపోనిక్ష రూపంలో విమానాల్లో నగరాన్ని తాకుతోంది. ఐటీ ఉద్యోగులు, విద్యార్థులే లక్ష్యంగా సాగుతున్న ఈ 'మత్తు' వ్యాపారం ఇప్పుడు సరిహద్దులు దాటుతోంది. ఒకవైపు జైలులో ఉన్న 'డాన్ల అండతో వారి వారసులు దందాను నడిపిస్తుంటే, మరోవైపు సామాన్య రాపిడో రైడర్ల ముసుగులో విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. లక్షల్లో జీతాలు తీసుకునే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు సైతం ఈ వ్యసనానికి బానిసై జీవితాలను, ఉద్యోగాలను బూడిద చేసుకుంటున్నారు. ఎయిర్‌పోర్టుల్లో పట్టుబడుతున్న కోట్ల విలువైన డ్రగ్స్ నుంచి, జిల్లా కేంద్రాల్లో మహిళలు గంజాయి రవాణా చేస్తూ దొరకడం వరకు.. ప్రతి ఘటన ఒక పెను సవాల్ ను విసురుతోంది. అక్రమ రవాణాలో మారుతున్న వ్యూహాలు, విదేశీ గంజాయి దిగుమతి, విచ్ఛిన్నమవుతున్న కుటుంబాల నేపథ్యంతో గంజాయి మాఫియా అరాచకాలపై 'వేద న్యూస్ణ అందిస్తున్న కథనం..

## ఇదే లాస్ట్ చాన్స్!

- మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేలపై చర్యలు ఏమయ్యాయి?
- రెండు వారాల్లోగా నిర్ణయం తప్పనిసరి
- లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాలి
- స్పీకర్ పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు




**వేద న్యూస్, న్యూఢిల్లీ ప్రతినిధి:**

ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వ్యవహారశైలిపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ అంశంపై ఇప్పటికే తగినంత సమయం ఇచ్చామని పేర్కొంటూ, ఇదే చివరి అవకాశమని స్పష్టంగా హెచ్చరించింది. మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హత అంశంపై రెండు వారాల్లోగా తప్పనిసరిగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించింది. నిర్ణయం తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని, అవసరమైతే తామే నిర్ణయం తీసుకునే పరిస్థితి వస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది. అనర్హత అంశంపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలతో రెండు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఫిరాయింపుల అంశాన్ని నిర్లక్ష్యం చేయలేమని, దీనిపై

మిగతా 3వ పేజీలో..

## 'చనాక-కొరాటా'తో వేల ఎకరాలు సాగులోకి

- సాగునీటి విస్తీర్ణాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యం
- సీఎం రేవంత్ రెడ్డి
- హతిఘాట్‌లో బ్యారేజ్ పంప్‌హౌస్ ప్రారంభం
- లోయర్ పెనుగంగ ప్రధాన కాలువకు నీటి విడుదల



3లో..

## కేసీఆర్ హయాంలోనే 90శాతం పూర్తైన ప్రాజెక్టులు

- నేడు ప్రారంభం కావడం సంతోషకరం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- చనాక-కొరాట, సదర్‌మాట్ బరాజ్‌లతో ఉత్తర తెలంగాణకు సాగునీటి భరోసా



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

మాజీ సీఎం కేసీఆర్ హయాంలో ప్రారంభమై, తొంభై శాతం పైగా పనులు పూర్తిచేసుకున్న రెండు కీలక ఇరిగేషన్ ప్రాజెక్టులు నేడు ప్రారంభం కావడం సంతోషకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సాగునీటి రంగంలో కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు తెలంగాణ వ్యవసాయ భవిష్యత్తును మార్చాయని ఆయన వ్యాఖ్యానించారు. చనాక-కొరాట బరాజ్‌ను 0.98 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించామని, బీఆర్ఎస్ పాలనలోనే పనులు 95 శాతం పూర్తయ్యాయని కేటీఆర్

మిగతా 3వ పేజీలో..

## జన సంద్రంగా మేడారం

- జాతరకు ముందే తరలివస్తున్న భక్తులు
- ఒక్క రోజే 6 లక్షల మందికిపైగా దర్శనం చేసుకున్నట్లు అంచనా
- రేపు మేడారం వెళ్లనున్న సీఎం, మంత్రులు
- మొదటి సారిగా అక్కడే క్యాబినెట్ మీటింగ్
- 19న అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం
- భారీగా భద్రత ఏర్పాట్లు చేసిన పోలీసులు




**వేద న్యూస్, మేడారం:**

ప్రపంచ ప్రఖ్యాత మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు భక్తులు పోటెత్తుతున్నారు. జాతర ముందు నుంచే మేడారంలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఒక్కరోజే 6 లక్షల మందికిపైగా భక్తులు తల్లులను దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇది ఇటీవలి కాలంలోనే రికార్డు స్థాయిగా భావిస్తున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు మేడారానికి తరలివస్తున్నారు. భక్తుల రాకతో మేడారం, తాడ్వాయి, ఏటూరు నాగారం మార్గాలు వాహనాలతో కిటకిటలాడుతున్నాయి. బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, లారీల్లో భక్తులు మేడారం తరలుతున్నాయి. భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ కోసం జిల్లా పోలీసులు భారీ ఏర్పాట్లు చేశారు. ఎస్పీ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తూ భద్రతా చర్యలను సమీక్షిస్తున్నారు. అదనపు పోలీస్ బలగాలు, డ్రోన్ నిఘా, సీసీ కెమెరాల పర్యవేక్షణతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. రేపు మేడారానికి సీఎం, మంత్రులు, కీలక ఐఏఎస్ అధికారులు వెళ్లనున్నారు. అంతేకాదు.. మేడారం లోనే క్యాబినెట్ మీటింగ్ మొదటి సారి జరనుంది. 19వ తేదీన సీఎం రూ.250కోట్లకు పైగా నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించనున్నారు.

## ఇంకెంతకాలం విచారణ?

- ఫోన్ టాపింగ్ కేసులో సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- ప్రభాకర్ రావు విచారణ పూర్తి చేయాలని ఆదేశం



**వేద న్యూస్, న్యూఢిల్లీ ప్రతినిధి:**


ఫోన్ టాపింగ్ కేసు విచారణపై సుప్రీం కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కేసులో ఇంకెంతకాలం విచారణ కొనసాగిస్తారని, దర్యాప్తులో మిగిలింది ఏమిటని ధర్మాసనం దర్యాప్తు సంస్థను ప్రశ్నించింది. ఇప్పటికే రెండు

మిగతా 3వ పేజీలో..

వేద న్యూస్
శనివారం జనవరి 17, 2026

# పుర పీఠంపై పార్టీల గురి

- పావులు కదుపుతున్న అధికార, ప్రతిపక్షాలు
- మెదక్ మున్సిపాలిటీలో పెరుగుతున్న రాజకీయ వేడి
- నాలుగుసార్లు ఓసీ జనరల్‌కే రిజర్వ్ అయిన చైర్మన్ పదవి
- ఇతర సామాజిక వర్గాల అసంతృప్తి
- పోటీకి అన్నీ సిద్ధం చేసుకుంటున్న ఆశావహులు



**వేద న్యూస్, మెదక్:**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. ఆయా పురపాలికల్లో ఈ నెల 12వ తేదీన ఓటర్ల తుది జాబితాను విడుదల చేసింది. త్వరలోనే ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. రాష్ట్రంలో కులగణన కోసం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ ప్రతిపాదనల ఆధారంగా బీసీ రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. పట్టణాల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా తక్కువగా ఉండటంతో, మొత్తం జనాభాలో వారి వాటా ప్రకారం ముందుగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. అనంతరం 50 శాతం పరిమితికి లోబడి బీసీలకు రిజర్వేషన్లు కేటాయించనున్నారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఇదే విధానాన్ని అనుసరించారు.

**నాలుగు సార్లు ఓసీ జనరల్‌కే..**

మున్సిపల్ చైర్మన్ పదవికి వరుసగా నాలుగు పర్యాయాలుగా ఓసీ జనరల్‌కు రిజర్వేషన్ కేటాయించడం పట్ల ఆశావహుల్లో అసంతృప్తి నెలకొంది. ఈసారైనా ఇతర సామాజిక వర్గాలకు అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గతంలో అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా రిజర్వేషన్లు మార్చారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

**ఆశావహుల చుట్టూ రాజకీయం**

ప్రస్తుతం అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీరిలో ఎక్కువ మంది ఓసీ జనరల్ సామాజిక వర్గానికి చెందినవారే కావడం గమనార్హం. అంతేకాకుండా కౌన్సిలర్ రిజర్వేషన్లు కూడా పోటీలో ఉండాలనుకునే అధికార పార్టీ నేతలకు అనుకూలంగా మార్చుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కౌన్సిలర్ రిజర్వేషన్లు ఆర్డీఓ పరిధిలో, చైర్మన్ రిజర్వేషన్లు రాష్ట్ర స్థాయిలో ఖరారు చేయనున్నారు. రిజర్వేషన్లు, సీట్ల కేటాయింపు ఆశావహులకు అనుకూలంగా జరగాలంటే అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర నాయకుల ప్రభావమే కీలకమని భావిస్తున్న అభ్యర్థులు, స్థానిక ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునేందుకు ఖర్చు చేయడానికీ వెనుకాడటం లేదన్న ప్రచారం సాగుతోంది.

# బూతు పురాణం..!

- తీవ్ర పదజాలంతో దూషించిన ఓ జాతీయ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు
- సోషల్ మీడియాలో ఫోన్ సంభాషణ వైరల్
- అమ్మవారిపేట గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు
- సమ్మక్క-సారలమ్మ జాతర స్థలం, కానుకల వ్యవహారమే కారణం
- రెండు కులస్తుల మధ్య తారస్థాయికి చేరిన విభేదాలు
- జాతర వేళ ఆందోళనలో స్థానిక ప్రజలు



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

సమ్మక్క, సారలమ్మ జాతరకు సంబంధించి ఓ రెండు కులస్తుల మధ్య తీవ్ర వివాదం చెలరేగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వరంగల్ జిల్లా అమ్మవారిపేట గ్రామంలో సమ్మక్క-సారలమ్మ జాతర స్థలం, కానుకల వ్యవహారాన్ని కేంద్రంగా చేసుకుని రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ఈ విషయమై గత కొద్ది రోజులుగా స్థానికంగా, అలాగే సోషల్ మీడియాలో రెండు వర్గాలు అనుచిత వ్యాఖ్యలతో దూషించుకుంటున్నాయి. కాగా, ఇదే అంశానికి సంబంధించి ఓ ప్రధాన జాతీయ పార్టీకి చెందిన జిల్లా ఉపాధ్యక్షుడు ఓ వ్యక్తిపై అత్యంత తీవ్ర పదజాలంతో దూషించడమే కాకుండా, చంపుతానని, పొడుస్తానని ఫోన్‌లో బెదిరించిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఇద్దరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గ్రామంలో ప్రతిసారీ నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా అమ్మవారిపేటలో జాతర స్థలం కేటాయింపు, భక్తుల నుంచి వచ్చే కానుకల నిర్వహణ విషయంలో రెండు కులాల మధ్య గత కొంతకాలంగా భేదాభిప్రాయాలు కొనసాగుతున్నాయి. ఈ వివాదం ఇటీవల తారస్థాయికి చేరిందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జరిగిన చర్చల్లో వేడి మరింత పెరిగి వాగ్వాదాలు తీవ్ర స్థాయికి చేరాయి. అందులో భాగంగా జాతీయ పార్టీకి చెందిన జిల్లా ఉపాధ్యక్షుడు మరో కులానికి చెందిన వ్యక్తిపై తిట్ల దాడికి దిగారని, దాంతో గ్రామంలో ఉద్రిక్తత మరింత పెరిగిందని బాధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. జాతర వంటి పవిత్ర కార్యక్రమాన్ని రాజకీయాలు, వ్యక్తిగత దూషణలతో కలుషితం చేయడం సరికాదని పలువురు గ్రామ పెద్దలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జాతర సమీపిస్తున్న తరుణంలో వివాదం రోజురోజుకూ ముదురుతుండటంతో గ్రామంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు, నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. జాతర నిర్వహణపై ఎలాంటి ఆటంకాలు లేకుండా, అన్ని వర్గాల సమన్వయంతో సమస్యకు పరిష్కారం కనుగొనాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ వ్యవహారం రాజకీయ రంగు పులుముకోవడంతో జిల్లా స్థాయిలో కూడా ఇది చర్చనీయాంశంగా మారింది.

# ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



- నిబంధనలు అతిక్రమిస్తే ఫైన్‌తో పాటు లైసెన్స్ రద్దు
- జిల్లా పోలీస్ కార్యాలయంలో 'నో హెల్మెట్
  - నో ఎంట్రీ' అమలు
- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

**వేద న్యూస్, మెదక్:**

ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని, జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చే సిబ్బంది, ప్రజలు హెల్మెట్ లేకుండా వస్తే కార్యాలయ ప్రాంగణంలోకి అనుమతి ఉండదని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అన్నారు. జిల్లాలో రోడ్డు భద్రతను మరింత పటిష్టం చేసేందుకు మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో 'అరైవ్ అలైవ్ణ రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా ఎస్పీ 'నో హెల్మెట్-నో ఎంట్రీ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్‌లకు ద్విచక్ర వాహనాలపై వచ్చే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. హెల్మెట్ ధరించకపోవడం, రాంగ్ రూట్‌లో వాహనం నడపడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలు ప్రాణాలకు తీవ్ర ప్రమాదకరమని ఎస్పీ హెచ్చరించారు. ఈ నిబంధనలను కఠినంగా అమలు చేస్తామని, ఎలాంటి ఊపేక్ష ఉండదని స్పష్టం చేశారు. తొలిసారి నిబంధనలు అతిక్రమిస్తే ఫైన్ విధిస్తామని, అదే తప్పిదాన్ని మళ్లీ చేస్తే కేసును మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌కు పంపి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో అనవసరంగా ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితిని నివారించాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ సిబ్బందితో కలిసి రహదారి భద్రతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, ఏఆర్ డీఎస్పీ రంగా నాయక్, సీఐలు సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, ఎస్ఐలు, పోలీస్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002-03 విద్యాసంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు రెండు దశాబ్దాల అనంతరం మళ్లీ కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పి, జీవితానికి దారి చూపిన ఉపాధ్యాయుల సేవలను పూర్వ విద్యార్థులు ఘనంగా కొనియాడారు. ఎన్నో సంవత్సరాల తర్వాత జరిగిన ఈ కలయిక తమ మధ్య స్నేహబంధాన్ని మరింత బలపరిచిందని, ఇలాంటి సమావేశాలు భవిష్యత్తులోనూ కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

# వేద న్యూస్ క్యాలెండర్ ఆవిష్కరణ



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**

వేద న్యూస్ తెలుగు దినపత్రిక 2026 నూతన క్యాలెండర్‌ను ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకట్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా దినపత్రికలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. వార్తా కథనాల ద్వారా అనేక ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుమ్మల జయ నర్సయ్య, వార్డు సభ్యులు, రిపోర్టర్ దగ్గుల అశోక్, నాయకులు తోకల శేఖర్, శివకుమార్, రాజేందర్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వందేళ్ళ ఘన చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ



**వేద న్యూస్, కారేపల్లి :**

సిపిఐ పార్టీకి వందేళ్ళ ఘన చరిత్ర కలిగిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ అని ఈనెల జనవరి 18న ఖమ్మంలో జరిగే వంద సంవత్సరాల వేడుకల బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పార్టీ శ్రేణులకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం కారేపల్లి మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్డులో మండల నాయకులు పుచ్చకాయల శ్రీనివాసరావు నివాస గృహంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో శివరాం కృష్ణ మాట్లాడుతూ మండల పరిధిలోనే పలు ప్రాంతాల నుండి అనేక వాహనాల ద్వారా కార్యకర్తలను ఈ భారీ బహిరంగ సభకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతోపాటు కార్యకర్తలను సభకు తరలి రావాలని కోరినట్లు ఆయన తెలిపారు. చిరస్థాయిగా నిలిచే విధంగా ఈ సభ ఏర్పాట్లు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. సిపిఐ పార్టీ జాతీయ అంతర్జాతీయ నాయకులతో పాటు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ సభలకు వస్తున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శివరామకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి పాపినేని సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా నాయకులు పుచ్చకాయల శ్రీనివాసరావు,వడ్డే వెంకటయ్య, పుచ్చకాయల వెంకటకృష్ణ, బొమ్మల కృష్ణమూర్తి, మేదరమట్ల ప్రేమ్చంద్, సిపిఎం నాయకులు ఎస్.కె సైదులు, హలవత్ చిన్నా, బొచ్చు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచులకు ఘన సన్మానం



**వేద న్యూస్, మెట్‌పల్లి :**

ఆత్మనగర్, ఆత్మకూరు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులకు 2002-2003 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మనగర్ గ్రామ సర్పంచ్ చిలివేరి విజయ, ఉపసర్పంచ్ సంపగి యమున, అలాగే ఆత్మకూరు గ్రామ సర్పంచ్ చిట్యాల రాజారాం, ఉపసర్పంచ్ కాసాడి తిరుపతిలను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. గ్రామాభివృద్ధిలో వారు చేస్తున్న సేవలను ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ సన్మాన కార్యక్రమంలో సంజీవ్, మురళి, రాజశేఖర్, మహేష్, నరేందర్, రాజేష్, రమేష్, మధుసూదన్, శ్రావణ్, రాజేందర్, నాగరాజు, ఎల్లయ్య, శేఖర్, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మంచినీళ్ల బావి చుట్టూ ముళ్ల పొదల తొలగింపు



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పత్తికుంటపల్లి గ్రామంలో గ్రామ ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్న మంచినీటి బావి చుట్టూ ఉన్న ముళ్ల పొదలను తొలగించారు. గత రెండేళ్లుగా బావి చుట్టూ ముళ్ల పొదలు పెరిగిపోవడంతో చెత్త కలిసిన నీరు సరఫరా అవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . గత రెండేళ్లుగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగడంతో గ్రామంలోని అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రజలు తాగునీటి కొరతతో పాటు ఇతర మౌలిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్ జుట్టు శేఖర్ గ్రామ ప్రజల ఆరోగ్యం, అవసరాలను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టారు. గ్రామ మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా మంచినీటి బావి చుట్టూ ఉన్న ముళ్ల పొదలు, చెట్లు, చేమలను జెసిబీ సహాయంతో తొలగించి, బావిలో చెత్త, చెదారం లేకుండా శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఎగుర్ల మల్లయ్య, గ్రామస్తులు గుడిసె ఎల్లయ్య, చింతలపెల్లి రవీందర్ రెడ్డి, ఎగుర్ల కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

# 37 ఏళ్ల సేవా ప్రస్థానానికి అభినందనలు

- అదనపు ఎస్పీకి అభినందనల వెల్లువ
- శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ, సిబ్బంది



**వేద న్యూస్, మెదక్:**

మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ 1989లో పోలీస్ శాఖలో చేరి 37 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు మాట్లాడుతూ.. క్రమశిక్షణ, నిబద్ధత, ప్రజాసేవలో అదనపు ఎస్పీ మహేందర్ చేసిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. పోలీస్ శాఖ అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన పాత్రను గుర్తు చేశారు. యువ పోలీస్ అధికారులకు ఆయన సేవా ప్రయాణం ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సిబ్బంది అదనపు ఎస్పీతో కలిసి కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. అనంతరం అదనపు ఎస్పీ మహేందర్ తన సేవా ప్రయాణంలో సహకరించిన ఉన్నతాధికారులు, సహోద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా భవిష్యత్తులోనూ అంకితభావంతో విధులు నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.

# 'మత్తు' పడగ!

- రాష్ట్రంలో విస్తరిస్తున్న గంజాయి మాఫియా
- పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా ఆగని దందా
- ఇటీవల పట్టుబడ్డ అత్యంత విలువైన హైడ్రోపోనిక్ల సరుకు
- మరో ఘటనలో భారీగా ఎండు గంజాయి స్వాధీనం
- ఒడిశా టు మహారాష్ట్ర తీసుకెళ్తుండగా దొరికిన వైనం
- పలు జిల్లాల్లో పట్టుబడుతున్న అక్రమార్కులు
- యువతే లక్ష్యంగా రాష్ట్రంలోకి ఎంట్రీ..
- సాగు తగ్గినా బయటి రాష్ట్రాల నుంచి దిగుమతి
- సాఫ్ట్ వేర్ ఉద్యోగులు సైతం గంజాయి మత్తుకి బానిస!



**వేద న్యూస్, క్రైమ్ బ్యూరో:**

తెలంగాణను మత్తు రహిత రాష్ట్రంగా మార్చాలని పోలీస్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతున్నా, గంజాయి మాఫియా కొత్త పుంతలు తొక్కుతోంది. ఒకప్పుడు మారుమూల అడవులకే పరిమితమైన ఈ దందా, ఇప్పుడు అంతర్జాతీయ విమానాల్లో 'హైడ్రోపోనిక్ల రూపంలో సిటీకి చేరుతోంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల నుంచి విద్యార్థుల వరకు అందరినీ ఈ మత్తు మహమ్మారి కమ్మేస్తోంది. తాజాగా జరిగిన ఘటనలు రాష్ట్రంలో గంజాయి నెట్‌వర్క్ ఏ స్థాయిలో పాతుకు పోయిందో కళ్లకు కడుతున్నాయి.



**'హై ప్రొఫైల్ల మత్తు..**

మామూలు గంజాయి కంటే వంద రెట్లు ఎక్కువ ప్రభావం చూపే హైడ్రోపోనిక్ గంజాయి ఇప్పుడు అంతర్జాతీయ మార్గాల్లో హైదరాబాద్‌కు దిగుమతి అవుతోంది. ఇటీవల ఖతార్ నుంచి విమానంలో వచ్చిన ఇద్దరు ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయగా, వారి లగేజీలో 14 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి బయటపడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ రూ. 14 కోట్లు ఉంటుందని అంచనా. మట్టి లేకుండా నీటిలోనే పెంచే ఈ ఖరీదైన గంజాయిని సంపన్న వర్గాలే లక్ష్యంగా సరఫరా చేస్తున్నట్లు అధికారులు

**ఒడిశా టు మహారాష్ట్ర.. వయా తెలంగాణ**

మరోవైపు, పక్కా ప్లాన్‌తో సరిహద్దులు దాటిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పటాన్‌చెరు పోలీసులు రెండ్రోజుల క్రితం పట్టుకున్నారు. ఒడిశాలోని పరలాఖేముడి నుంచి మహారాష్ట్రలోని సోలాపూర్‌కు 92 కిలోల ఎండు గంజాయి తరలిస్తుండగా ముత్తంగి టోల్ ప్లాజా వద్ద పోలీసులు వల పన్నారు. పోలీసులకు అనుమానం రాకుండా ఉండేందుకు ముందు వైపు ఒక పైలట్ కారును నడుపుతూ, వెనుక డీసీఎంలో గంజాయిని దాచి తరలిస్తున్నారు. ఈ కేసులో మహారాష్ట్రకు చెందిన సచిన్ చవాన్, మహేష్, విజయ్ చవాన్లను అరెస్ట్ చేశారు. కాగా, ఈ సరుకు విలువ విలువ రూ. 46 లక్షలు ఉంటుందని అంచనా.

**గంజాయి డాన్ వారసుల హవా..**

జైలులో ఉన్నా గంజాయి మాఫియా పట్టు తగ్గడం లేదు. హైదరాబాద్‌లో పేరుమోసిన గంజాయి డాన్ నీతూ సింగ్ అల్లుడు కన్నయ్య సింగ్ ఇటీవల గచ్చిబౌలిలో 3 కిలోల గంజాయితో పట్టుబడటం సంచలనం సృష్టించింది. నీతూ సింగ్ జైలులో ఉన్నప్పటికీ, ఆమె అండతోనే ఈ ఫ్యామిలీ నెట్‌వర్క్ నడుస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అదేవిధంగా, గచ్చిబౌలిలో రాపిడో రైడర్ ముసుగులో గంజాయి అమ్ముతున్న మరో వ్యక్తిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటివరకు పురుషులకే పరిమితమైన ఈ దందాలోకి ఇప్పుడు మహిళలు కూడా ప్రవేశించడం కలవరపెడుతోంది. నిజామాబాద్‌లో 13 కిలోల గంజాయిని చేతులు మారుస్తుండగా పట్టుబడ్డ వారిలో ఇద్దరు మహిళలు ఉండటం అధికారులను విస్మయానికి గురిచేసింది. పోలీసుల తనిఖీల్లో మహిళలపై అనుమానం రాదనే నెపంతో వీరిని స్మగ్లర్లు పావులుగా వాడుకుంటున్నారని నిజామాబాద్ ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు.

**జిల్లాలకు పాకుతున్న మత్తు**

గతంలో గంజాయి సాగు జిల్లాలోని అటవీ ప్రాంతాలు, గిరిజన గ్రామాలకు పరిమితమై ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. సాగు తగ్గినా, బయట రాష్ట్రాల నుంచి భారీగా దిగుమతి అవుతోంది. జిల్లాల వ్యాప్తంగా ఎక్కడో ఒకచోట గంజాయి పట్టుబడుతూనే ఉంది. ప్రతిసారి వేర్వేరు నిందితులు దొరుకుతుండటమే ఈ దందా ఎంత విస్తృతంగా ఉందో చెబుతోంది. గంజాయి మత్తు ఇప్పుడు విద్యార్థులు, యువకులను ఎక్కువగా కబళిస్తోంది. కాలేజీ విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు కూడా ఈ వ్యసనానికి బానిసలవుతున్న ఉదాహరణలు జిల్లాలో అనేకం. లక్షల్లో జీతాలు తీసుకునే ఉద్యోగాలు కోల్పోయినవారు, కుటుంబాలు ఛిన్నాభిన్నమైన ఘటనలు అధికారిక రికార్డుల్లో ఉన్నాయి.

**యువతే లక్ష్యంగా..**

విచిత్రమేంటంటే.. ఒకప్పుడు జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో గంజాయి సాగు ఇప్పుడు దాదాపుగా కనుమరుగైంది. గిరిజన గ్రామాల యువత చదువులు, ఉద్యోగాల వైపు అడుగులు వేయడంతో ఆ అక్రమ సాగు తగ్గింది. కానీ సాగు తగ్గిన చోటే రవాణా, వినియోగం రెట్టింపైంది. బయట రాష్ట్రాల నుంచి, అంతర్జాతీయ రూట్ల ద్వారా గంజాయి జిల్లాల్లోకి ప్రవేశిస్తోంది. ముఖ్యంగా యువత, కాలేజీ విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు ఈ మత్తుకు బానిసలవుతున్నారని అధి కారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలకు లక్షల్లో జీతం పొందే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కూడా గంజాయి వ్యసనంతో ఉద్యోగాలు కోల్పోయిన ఉదాహరణలు జిల్లాల్లో ఎన్నో ఉన్నాయి. కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి. భవిష్యత్తులు అంధకారంలోకి జారి పోతున్నాయి.

**కఠినంగా వ్యవహరించకపోతే..**

ఎయిర్‌పోర్ట్‌ల్లో కోట్ల విలువైన డ్రగ్స్, నగరాల్లో కాలనీల స్థాయిలో విక్రయాలు, జిల్లాల్లో మహిళల ఎంట్రీ.. ఇలాంటి ఘటనలన్నీ చూస్తుంటే రాష్ట్రాన్ని మత్తు ముప్పు వైపు నడిపిస్తున్నాయా అన్నట్లు అనిపిస్తోంది. పట్టుబడుతున్న ప్రతి కేసు ఒక కొత్త నెట్‌వర్క్ ను బయటపెడుతోంది. కాబట్టి ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోకపోతే, ఈ మత్తు మాఫియా మరింత లోతుగా వేర్లు పాతుకుపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గంజాయి దందాను అరికట్టడం కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు.. సమాజం మొత్తం కలిసే ఎదుర్కోవాల్సిన సవాల్.

## 'చనాక-కొరాటా'తో వేల ఎకరాలు సాగులోకి

**వేద న్యూస్, ఆదిలాబాద్:**

పెనుగంగ నదీ జలాలను సమర్థవంతంగా వినియోగించి సాగునీటి విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని, చనాక-కొరాటా బ్యారేజ్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అమలులోకి వస్తే వేల ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా భోరాజ్ మండలం హతిఘాట్ గ్రామంలో చనాక-కొరాటా బ్యారేజ్ పంప్‌హౌస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లోయర్ పెనుగంగ ప్రాజెక్టు ప్రధాన కాలువకు నీటిని విడుదల చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉత్తర తెలంగాణ ప్రాంతానికి సాగునీటి రంగంలో కీలక మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. చనాక-కొరాటా బ్యారేజ్ తో రైతుల ఆర్థిక పరిస్థితిలో స్పష్టమైన మార్పు వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అటవీ-పర్యావరణ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నాగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. లోయర్ పెనుగంగ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి సాగునీటితో పాటు త్రాగునీటి సమస్యలు కూడా క్రమంగా పరిష్కారమవుతాయని అధికారులు తెలిపారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఇంకెంతకాలం విచారణ?

వారాల పాటు కస్టడీకి అనుమతి ఇచ్చామని గుర్తుచేస్తూ, దర్యాప్తు ఉద్దేశ్యం పూర్తయ్యిందా లేదా స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించింది. ఈ సందర్భంగా ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు విచారణను వెంటనే పూర్తి చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. ఆర్టికల్ 142 కింద కేసు దర్యాప్తును దృష్టిలో ఉంచుకుని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినట్లు ధర్మాసనం వెల్లడించింది. ప్రభాకర్ రావును మళ్లీ జైలుకు పంపాలని భావిస్తున్నారా అంటూ కూడా కోర్టు ప్రశ్నించింది. ముందస్తు బెయిల్ ఇచ్చినంత మాత్రాన ఆయనను విచారణకు పిలవకుండా ఉండలేమని, అవసరమైతే మళ్లీ పిలిచి ప్రశ్నించవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభాకర్ రావు దర్యాప్తుకు సహకరిస్తారని కోర్టు అభిప్రాయపడింది. తదుపరి విచారణ వరకు మధ్యంతర రక్షణను కొనసాగిస్తూ, ఈ కేసు విచారణను మార్చి 10కు వాయిదా వేసింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్ర వాదనలు వినిపించారు. ప్రభాకర్ రావు పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా అనే అంశాన్ని కోర్టు ముందు లేవనెత్తారు. కస్టడీలో ఉన్న వ్యక్తికి ముందస్తు బెయిల్ ఎలా ఇవ్వగలమన్నది కీలక న్యాయపరమైన ప్రశ్నగా పేర్కొన్నారు. ఈ వాదనల నేపథ్యంలో ఫోన్ టాపింగ్ కేసు మరింత కీలక మలుపులు తిరుగుతుందన్న చర్చ న్యాయ వర్గాల్లో కొనసాగుతోంది.

## కేసీఆర్ హయాంలోనే 90శాతం పూర్తైన ప్రాజెక్టులు

తెలిపారు. 2023 సెప్టెంబర్‌లో ప్రయోగాత్మకంగా నీటి విడుదల కూడా జరిగిందని గుర్తు చేశారు. ఈ బరాజ్‌కు అనుబంధంగా ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లోని 89 గ్రామాలకు చెందిన సుమారు 51 వేల ఎకరాలకు సాగునీరు అందేలా రూపకల్పన చేశామని చెప్పారు. 2016లో మహారాష్ట్ర ప్రభుత్వంతో అంతర్రాష్ట్ర ఒప్పందం కుదుర్చుకుని ఈ ప్రాజెక్టును ప్రారంభించినట్లు వివరించారు. సదర్‌మాట్ బరాజ్‌ను 1.58 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మించామని, కేసీఆర్ హయాంలోనే 90 శాతం పనులు పూర్తయ్యాయని కేటీఆర్ తెలిపారు. దీని ద్వారా నిర్మల్, జగిత్యాల జిల్లాల్లోని సుమారు 18 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేలా ప్రణాళిక రూపొందించామని అన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తే ఆయా జిల్లాల్లో వ్యవసాయ ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. 2014 నుంచి 2023 వరకు సాగిన తెలంగాణ దశాబ్ద కాలంలో సాగునీటికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎండిపోయిన భూములను సస్యశ్యామలం చేసి, తెలంగాణను దేశానికి ధాన్యాగారంగా మార్చిన ఘనత కేసీఆర్ పాలనకే దక్కుతుందని ఆయన వ్యాఖ్యానించారు. సాగునీటి ప్రాజెక్టులు, రైతు




అనుకూల విధానాలే తెలంగాణ వ్యవసాయ బలానికి పునాదిగా నిలిచాయని తెలిపారు. జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులు అర్పించారు. విలువల రాజకీయాలకు ప్రతీకగా జైపాల్ రెడ్డి స్మృతి తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని నేతలు పేర్కొన్నారు.

## ఇదే లాస్ట్ చాన్స్!

స్పష్టత రావాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ కేసు విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది. తదుపరి విచారణలో స్పీకర్ తీసుకునే నిర్ణయం, సమర్పించే అఫిడవిట్ ఆధారంగా తదుపరి చర్యలు నిర్ణయిస్తామని తెలిపింది. సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.

## స్వర్గీయ జైపాల్ రెడ్డికి ఘన నివాళులు

### - స్ఫూర్తి స్థల్ వద్ద సీఎం పుష్పాంజలి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



కేంద్ర మాజీ మంత్రి, స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డి 84వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ పీవీ మార్గ్‌లోని నెక్లెస్ రోడ్ వద్ద ఉన్న స్ఫూర్తి స్థల్‌కు చేరుకుని పుష్పాంజలి ఘటించారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయానికి అంకితమైన ఆయన సేవలను సీఎం స్మరించారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి రాజకీయ జీవితం, సిద్ధాంతపరమైన నిబద్ధత, ప్రజా సమస్యలపై ధైర్యంగా నిలిచే స్వభావాన్ని ముఖ్యమంత్రి కొనియాడారు. కేంద్ర మంత్రిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశాభివృద్ధికి దోహదపడ్డాయని తెలిపారు. ఈ నివాళుల కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, అలాగే సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొని పుష్పాంజలి ఘటించారు.

## మహిళలకు ముగ్గుల పోటీలు

**వేద న్యూస్, కాసిపేట :**



సోనాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సోనాపూర్, బాదుగూడ, నాయకపూగూడ, దొడ్డిగూడ, జెండగూడ గ్రామాల మహిళల కోసం శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 23 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల ఫలితాల్లో మొదటి బహుమతి మర్సుకోల అఖిల, రెండవ బహుమతి కుడ్మేత అరుణ, మూడవ బహుమతి కోర్వేత జయ గెలుచుకున్నారు. అదనంగా పోటీల్లో పాల్గొన్న మరో 20 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ మహేందర్, ఉపసర్పంచ్ కోర్వేత శంకర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు కలిసి నిర్వహించారు. ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథులుగా అదాని యూనియన్ లీడర్ భీమిని మహేందర్, ఆదివాసీ నాయకపోడ్ రాష్ట్ర నాయకుడు కొమ్ముల బాపన్న, సామాజిక సేవ నాయకుడు వెంబడి కిషన్, ఆయన సతీమణి పద్మ, రాష్ట్ర తుడుం దెబ్బ అధ్యక్షుడు కనక రాజు, బద్ది శ్రీనివాస్, సీఆర్పీఎఫ్ జవాన్ కుడ్మేత లక్ష్మణ్ హాజరయ్యారు. అలాగే కొమ్ముల రజిత, కనక మనుకు, బక్క రాజయ్య, అర్క లింగు, కోవా కృష్ణారావు, మడవి చిన్ను, కార్వేత జ్యోతి రామ్‌తో పాటు గ్రామ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

వేద న్యూస్

శనివారం జనవరి 17, 2026

# బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ లో చేరిక

**– పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు అయూబ్**



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

గ్రేటర్ వరంగల్ నగరంలోని ఏనుమాముల బాలాజీ నగర్ లో వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎండీ అయూబ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భం గా అయూబ్ మాట్లాడుతూ. .ప్రజాసంక్షేమం ,సామాజిక న్యాయం, అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ విధానాలపై విశ్వాసంతోనే బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరుతున్నారని అన్నారు. ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీని విడిచిపెట్టి కాంగ్రెస్ లోకి వస్తున్న ప్రతి కార్యకర్తకు హృదయపూర్వక స్వాగతం తెలియజేశారు. భవిష్యత్తులో ఏనుమాముల బాలాజీ నగర్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంలో కొత్తగా చేరిన కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఇంతియాజ్, పురాణం రవి, కడెం కుమార్, పస్తాం శంకర్, పత్రి రాజేష్ మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# తెలియని లింకులతో జాగ్రత్త!

- సైబర్ నేరాలు పెరుగుతున్నాయి
- 'డిజిటల్ అరెస్ట' పేరుతో మోసాలు
- అవగాహన కార్యక్రమంలో వక్తలు



**వేద న్యూస్, శాయంపేట:**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వీడియోలు, ఆన్లైన్ మోసాల వల్ల ఏది నిజం, ఏది అబద్ధమో తెలియని పరిస్థితి ఏర్పడిందని, వాట్సాప్ గ్రూపులు, ఫోన్ మెసేజ్‌ల ద్వారా వచ్చే అపరిచిత లింకులపై క్లిక్ చేసి ఉచితంగా డబ్బులు సంపాదించవచ్చని నమ్మి చాలామంది మోసపోయారని వక్తలు పేర్కొన్నారు. శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం గ్రామంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఫ్ఎల్ కౌన్సిలర్ మారపల్లి క్రాంతి కుమార్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, గ్రామ సర్పంచ్ శివాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి హామీ లేకుండా లోన్లు ఇస్తామని చెప్పే లింకులు కూడా సైబర్ మోసాలేనని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పడం, అనధికార లింకులను ఓపెన్ చేయడం వల్లే సైబర్ నేరాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా పొరపాటున డబ్బులు వచ్చాయని చెప్పి తిరిగి పంపించమని కోరడం కూడా మోసమేనని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో అపరిచిత లింకులు ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని, తెలియని వారికి డబ్బులు పంపించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగశ్రీ, మారపల్లి విజయ్, ప్రసాద్, పరకాల కౌన్సిలర్లు, వార్డు సభ్యులు పెంబర్తి సురేష్, రఘుపతి, నాగరాజ్, గ్రామస్తులు కిషన్ రెడ్డి, మొగిలి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

**వేద న్యూస్, శాయంపేట :**

ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, టేకుమట్ల మండలంలోని గరిమెళ్లపల్లి వాగు నుంచి ఎలాంటి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న నెగ్గల శివ మారుతి ట్రాక్టర్‌ను శాయంపేట గ్రామంలో పెట్రోలింగ్ సందర్భంగా గుర్తించారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు నిర్ధారణ కావడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై తదుపరి చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# సీనియర్ కాంగ్రెస్ నాయకుడికి

**– మంత్రి దామోదర్ పరామర్శ**



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

సంగారెడ్డి జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జ్ సిద్ధం రెడ్డి నారాయణ్ రెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆసుపత్రిలో నారాయణ్ రెడ్డిని కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిపై వివరంగా తెలుసుకున్న మంత్రి, చికిత్స అందిస్తున్న వైద్యులను సంప్రదించి ప్రస్తుతం చేపడుతున్న వైద్య సేవలు, కోలుకునే ప్రక్రియపై సమాచారం తీసుకున్నారు. అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందేలా చూడాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా నారాయణ్ రెడ్డి కుమారుడు, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకుడు ఉజ్వల్ రెడ్డితో మంత్రి మాట్లాడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వపరంగా అవసరమైన సహకారం పూర్తిగా అందిస్తామని హామీ ఇచ్చారు. నారాయణ్ రెడ్డి త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. అలాగే పలువురు కాంగ్రెస్ నాయకులు కూడా ఆసుపత్రికి చేరుకుని నారాయణ్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, ఆయన త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

# కనుమ పండుగ రోజున విషాదం..

**వేద న్యూస్ అమరావతి:**



ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో కనుమ పండుగ రోజున విషాదం చోటు చేసుకుంది. సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్న యువకులు కనుమను కూడా అంతే ఘనంగా జరుపుకోవటానికి సన్నద్ధం అవుతున్న సమయం లో మృతి చెందారు. జిల్లాలోని అల్లూరు మండలం ఇసుకపల్లి బీచ్‌లో సముద్ర స్నానానికి వెళ్లిన నలుగురు యువకులు స్నానం చేస్తూ గల్లంతయ్యారు. వీరిలో ఒకరి మృతదేహం ఒడ్డుకు కొట్టుకు వచ్చింది. మిగతా ముగ్గురు యువకుల కోసం మత్స్యకారులు, పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. ఇంకా మృతి చెందిన, గల్లంతైన వారి వివరాలు తెలియరాలేదు.

# ఓటమి జీర్ణించుకోలేక దాడులు..?

**వేద న్యూస్, కారేపల్లి :**

స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసినప్పటికీ కారేపల్లి మండలం పోలంపల్లి గ్రామ పంచాయతీలో ఎన్నికల ఘర్షణ వాతావరణం ఇంకా కొనసాగుతోంది. సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన వారికి మద్దతుగా నిలిచిన వారిని ప్రత్యర్థులు టార్గెట్ చేసి దాడులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓటమిని జీర్ణించుకోలేక పచ్చని పల్లెలో అరాచక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రత్యర్థి అనుచరులు చేసిన దాడుల పై ఇటీవల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు కూడా నమోదయ్యాయి. పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు అయినప్పటికీ ప్రత్యర్థుల ప్రవర్తనలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్పంచ్ అభ్యర్థికి ఎవరు మద్దతుగా వ్యవహరించారో వారిని గుర్తించి అక్రమ దాడులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సొంత కమ్యూనిటీలోనే ఉంటూ ప్రత్యర్థికి మద్దతు ఇవ్వడాన్ని జీర్ణించుకోలేక ఘర్షణలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓడిపోయిన వర్గాలు చిందు విందులు, డీజే డాన్సులతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ రాత్రంతా ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధంగా ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొనబడింది. అయినప్పటికీ ప్రజల స్వేచ్ఛను కాలరాస్తూ దాడులకు పాల్పడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించినప్పటికీ ప్రత్యర్థుల వైఖరిలో మార్పు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో పోలంపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నలుగురు అభ్యర్థులు పోటీ చేయగా, అధికార పార్టీ మద్దతు అభ్యర్థి విజయం సాధించారు. అదే రోజు సాయంత్రం శివరామ్ అనుచరులు ఇండిపెండెంట్ అభ్యర్థి భద్రమ్మ ఇంటిపై దాడి చేయడమే కాకుండా, భద్రమ్మ కుటుంబ సభ్యులైన జబ్బ కార్తీక్, తాటి పాపారావు పై దాడికి పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో కార్తీక్ కంటిపై తీవ్ర గాయాలు కావడంతో అతడిని ఆసుపత్రికి తరలించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు తక్షణమే కేసు నమోదు చేశారు. ఇదే గ్రామానికి చెందిన అలేం ప్రభాకర్‌ను కూడా బెదిరింపులకు గురిచేయగా, ఆయన ఫిర్యాదుతో మరో కేసు నమోదు చేశారు. అనంతరం కారేపల్లి పోలీసులు ఏసీపీ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో సీఐ నునావత్ సాగర్, ఎస్ఐ బైరు గోపితో కలిసి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి చట్టంపై అవగాహన కల్పిస్తూ దాడులకు పాల్పడవద్దని హెచ్చరించారు. పోలీసుల కౌన్సిలింగ్‌తో గొడవలు సద్దుమణిగాయని భావించిన లోపే ఈ నెల 14వ తేదీ రాత్రి మళ్లీ పోలంపల్లి గ్రామంలోని నాగయ్య గుంపు వద్ద డీజే విందులతో పార్టీలు చేసుకుంటూ కొందరు వ్యక్తులు "శివరామ్‌కు ఎందుకు సపోర్ట్ చేయలేదని ప్రశ్నిస్తూ కురుస సాయి ప్రకాష్ అనే యువకుడి కుటుంబంపై దాడి చేశారని ఆరోపణలు ఉన్నాయి. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి దశ పత్రికను ఆశ్రయించారు. పోలీస్ అధికారులు తాత్కాలిక కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని, కఠిన చర్యలు తీసుకోవడం లేదని వివిధ కుల సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా దాడులకు పాల్పడిన వారిని ముందస్తు బెయిల్ ఇవ్వకుండా కోర్టుకు హాజరు పరచి రిమాండ్‌కు పంపాలని గ్రామ ప్రజలు పోలీసులను వేడుకుంటున్నారు. పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించకపోతే చిన్నచిన్న గొడవలే హత్యలకు దారి తీసే అవకాశముందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

# డీసీసీ అధ్యక్షుడు అయూబ్ ను ఘనంగా సన్మానించిన రచ్చ రవి

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

హనుమకొండ రాయపుర లోని ప్రముఖ నటుడు, హాస్యనటుడు మరియు వరంగల్ మున్సిపాలిటీ స్వచ్ఛ భారత్ బ్రాండ్ అంబాసిడర్ రచ్చ రవి నివాసంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎండీ ఆయుబ్ ని ఘనంగా సన్మానించడం జరిగింది. రచ్చ రవి కమెడియన్‌గా ఎదగకముందు వరంగల్ మున్సిపాలిటీలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన సమయంలో, అదే కాలంలో ప్రస్తుత వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎండీ ఆయుబ్ కాంగ్రెస్ పార్టీ లో చిన్న కార్యకర్తగా ఉన్నారు. ఆ రోజుల్లో ఇద్దరి మధ్య ఏర్పడిన స్నేహబంధం ఇప్పటికీ అలాగే కొనసాగుతుంది. రచ్చ రవి తన ప్రతిభతో సినీ రంగంలో మరియు జబరదస్త్ తో గుర్తింపు తెచ్చుకొని, ప్రస్తుతం వరంగల్ మున్సిపాలిటీ స్వచ్ఛ భారత్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న రచ్చ రవి ఒకవైపు మరోవైపు ప్రజాసేవలో నిరంతరం ముందుండి కష్టసుఖాలో కార్యకర్తలకు అండగా ఉండి ఇంటి పేరునే కాంగ్రెస్ గా మార్చుకొని అందరికి కాంగ్రెస్ అయూబ్ గా సూపరిచితుడై కార్యకర్త నుండి చారిత్రమక మైన వరంగల్ జిల్లా కు అధ్యక్షుడు అవడం అభిమానందనీయం. ఇద్దరు అటు రచ్చ రవి ఇటు అయూబ్ ఎదిగిన తీరు గర్వనీయం అని ఒకరికి ఒకరు అభినందనలు తెలుపుతూ తమ గత స్మృతులను నెమరు వేసుకోవడం జరిగింది. రచ్చ రవి తల్లితండ్రులతో పాటు వరంగల్ జిల్లా కళాకారుడు జిల్లా అధ్యక్షుడు అయూబ్ ను సన్మానించుకోవడం జరిగింది.



# ఆదిలాబాద్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక



**వేద న్యూస్, నిర్మల్:**

- పాలమూరుతో సమానంగా అభివృద్ధి చేస్తాం
- బాసర ఐఐఐటీలో విశ్వవిద్యాలయం, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం
- నిర్మల్‌లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, భారీ పారిశ్రామిక వాడ
- ప్రజా పాలన-ప్రగతి బాట సభలో సీఎం రేవంత్ రెడ్డి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విస్తృత కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. బాసర ఐఐఐటీలో విశ్వవిద్యాలయం ఏర్పాటు, నిర్మల్‌లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, తుమ్మిడిహెట్టి వద్ద చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం, జిల్లాలో అతిపెద్ద పారిశ్రామిక వాడ అభివృద్ధి వంటి కీలక నిర్ణయాలను వెల్లడించారు. రూ.386.46 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజా పాలన -ప్రగతి బాట సభలో మాట్లాడుతూ.. గతంలో ఆదిలాబాద్‌కు రావాల్సిన అభివృద్ధి, నీటి వనరులు అందలేదని, ప్రజా ప్రభుత్వం ఈ పరిస్థితిని మార్చేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పాలమూరు జిల్లాకు ఇచ్చిన ప్రాధాన్యతను అదే స్థాయిలో ఆదిలాబాద్‌కూ ఇస్తామని హామీ ఇచ్చారు. చనాక-కొరాట బ్యారేజీకి మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రారెడ్డి పేరు, సదర్మట్ బ్యారేజీకి స్వతంత్ర సమరయోధుడు పి. నర్సారెడ్డి పేరు పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. నిర్మల్‌లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పిస్తామని, బాసర ఐఐఐటీలోనే విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. జిల్లాలో 10 వేల ఎకరాలతో భారీ పారిశ్రామిక వాడ అభివృద్ధి చేసి పరిశ్రమలను ఆకర్షిస్తామని, తుమ్మిడిహెట్టి వద్ద డా. బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును తప్పనిసరిగా నిర్మిస్తామని సీఎం స్పష్టం చేశారు. నాగోబా జాతర అభివృద్ధికి రూ.22 కోట్లు, మేడారం సమ్మక్క-సారలమ్మ మందిర అభివృద్ధికి సుమారు రూ.300 కోట్లతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఫిబ్రవరి తొలి వారంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించి నివేదిక ఆధారంగా బడ్జెట్‌లో అనుమతులు ఇస్తామని తెలిపారు. 'మేము పాలకులం కాదు, సేవకులం' అని పేర్కొంటూ, ఆదిలాబాద్‌ను తెలంగాణ అభివృద్ధి పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ గోడం నాగేష్ తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తిరుపతమ్మ తల్లి సన్నిధిలో భట్టి విక్రమార్క

**వేద న్యూస్, పెనుగంచిప్రోలు:**



పెనుగంచిప్రోలులోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయాన్ని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దర్శించి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసిన భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, కుటుంబాల్లో శాంతి, సమృద్ధి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పెనుగంచిప్రోలు అమ్మవారి క్షేత్రం ప్రజల విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకంగా రైతుల సంక్షేమం కోసం ప్రార్థించిన ఉప ముఖ్యమంత్రి, రైతన్నలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, సాగునీరు, మౌలిక సదుపాయాలతో గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగాలని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆధ్యాత్మిక విలువలను కాపాడుకుంటూనే సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తాం

- చెన్నూర్ నియోజకవర్గంలో అంతర్గత రహదారుల నిర్మాణం
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- మంత్రి గడ్డం వివేకానంద



**వేద న్యూస్, మంచిర్యాల:**

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ రాజుతో కలిసి మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. చెన్నూర్ నియోజకవర్గంలో గ్రామాలను అనుసంధానించే అంతర్గత రహదారుల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణలో భాగంగా మురుగు కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేదలకు లబ్ధి చేకూర్చేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. అమృత్ పథకం కింద ఇంటింటికీ నల్లా కనెక్షన్ ద్వారా శుద్ధ తాగునీరు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో వివిధ వార్డులలో టీయూఎఫ్ఐడీసీ, డీఎంఎఫ్టీ, సీఎస్ఆర్, నగరాభివృద్ధి నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. అల్లూరినగర్ (1వ వార్డు) రూ.73.46 లక్షలు, తిలక్‌నగర్ (2వ వార్డు) రూ.72.56 లక్షలు, 7వ వార్డు రూ.72.56 లక్షలు, చైతన్య కాలనీ (8వ వార్డు) రూ.1.89 కోట్లు, ఆర్.ఆర్.నగర్ (9వ వార్డు) రూ.46 లక్షలు, న్యూ తిమ్మాపూర్ రూ.52.50 లక్షలు, ఓల్డ్ తిమ్మాపూర్ రూ.44.50 లక్షలు, గాంధీనగర్ (12వ వార్డు) రూ.6.17 లక్షలు, ఆమ్‌నగర్ (13వ వార్డు) రూ.6.17 లక్షలు, మల్లికార్జున నగర్ (14వ వార్డు) రూ.27.22 లక్షలు, గంగా కాలనీ (16వ వార్డు) రూ.34.64 లక్షల అంచనా వ్యయంతో పనులు జరుగుతాయని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. మంత్రితో పాటు మందమర్రి తహసీల్దార్ సతీష్, డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# మెట్రో రెండో దశపై వేగం అవసరం

- ముఖ్యమంత్రికి కిషన్ రెడ్డి లేఖ
- సంయుక్త కమిటీకి అధికారులు నామినేట్ చేయాలని విజ్ఞప్తి



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల్లో జరుగుతున్న జాప్యాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. మెట్రో రెండో దశ ప్రాజెక్టు హైదరాబాద్ నగర ప్రజల అవసరాలకు ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. మెట్రో రెండో దశకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయ అంగీకారం తెలిపిందని లేఖలో గుర్తు చేసిన కిషన్ రెడ్డి, మొదటి దశను ప్రైవేట్ సంస్థ నుంచి స్వాధీనం చేసుకున్న తర్వాత రెండో దశపై సమన్వయం ప్రారంభించాలన్న అవగాహన ముందుగానే ఉందన్నారు. ఈ ప్రక్రియ కోసం ఇరు ప్రభుత్వాలు సంయుక్త కమిటీ ద్వారా ముందుకు సాగాలని నిర్ణయించినట్లు తెలిపారు. అయితే తెలంగాణ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు సంయుక్త కమిటీకి అధికారులను నామినేట్ చేయకపోవడంతో సమన్వయం ఆలస్యం అవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులను కమిటీకి నియమిస్తే కేంద్రం--రాష్ట్రం మధ్య సమన్వయం ప్రారంభమై మెట్రో విస్తరణ పనులు వేగవంతమవుతాయని అభిప్రాయపడ్డారు. రవాణా సమస్యల పరిష్కారం, కాలుష్య నియంత్రణ, నగర విస్తరణకు మెట్రో ఎంతో అవసరమని పేర్కొన్న కిషన్ రెడ్డి, హైదరాబాద్ ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా మెట్రో రెండో దశను ఆలస్యం లేకుండా ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# పాలేరులో రూ.362 కోట్ల అభివృద్ధి పనుల శంకుస్థాపనలు

- 18న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదగా చారిత్రక కార్యక్రమం
- విద్య, వైద్యం, సాగునీరు, మార్కెట్ రంగాల్లో కీలక ప్రాజెక్టులు
- మేడారంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం, 19న రాతి కట్టడాల ప్రారంభం



**వేద న్యూస్ ఖమ్మం :**

పాలేరు నియోజకవర్గ చరిత్రలోనే కనీవిని ఎరుగని రీతిలో రూ. 362 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ఈ నెల 18న శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడైంది. గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదగా జరిగే ఈ కార్యక్రమం పాలేరు నియోజకవర్గ అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనుంది. ముఖ్యమంత్రి పాలేరు పర్యటనను పురస్కరించుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొని, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. మద్దులపల్లిలో జేఎన్టీయూ కళాశాలకు శంకుస్థాపన చేయడంతో పాటు నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవాన్ని ముఖ్యమంత్రి నిర్వహించనున్నారు. అదేవిధంగా మున్నేరు--పాలేరు లింక్ కెనాల్ నిర్మాణ పనులను ప్రారంభించి సాగునీటి రంగానికి మరింత బలం చేకూర్చనున్నారు. మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ ప్రారంభంతో రైతులకు నేరుగా లబ్ధి చేకూరనుంది. అలాగే కూసుమంచిలో నిర్మించనున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ భారీ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొననున్నారు. ఇదే వేదికగా రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల సన్నద్ధతపై ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తలతో ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు. ఇదిలా ఉండగా, తొలిసారిగా రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా ఈ నెల 18న మేడారంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. సమ్మక్క--సారలమ్మ జాతరను కుంభమేళా కంటే అద్భుతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. మేడారంలో కాకతీయుల నాటి వైభవం ఉట్టిపడేలా నిర్మించిన రాతి కట్టడాలను 19వ తేదీ ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాలతో పాలేరు, మేడారం ప్రాంతాలు రాష్ట్ర అభివృద్ధి పటంలో మరింత ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి.

# భక్తులకు శుభవార్త.. రూ.299 చెల్లిస్తే ఇంటివద్దకే మేడారం ప్రసాదం..!




**వేద న్యూస్ హైదరాబాద్ :**

ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన "సమ్మక్క సారలమ్మ జాతర" ఈ నెల 28 నుండి 31వ తేదీ వరకు జరుగనుంది. ములుగు (వరంగల్) జిల్లాలోని మేడారంలోల్లో కొలువైన వనదేవతలకు బంగారం సమర్పించుకునేందుకు తండోపతండాలుగా భక్తజనం తరలివస్తారు. ఈ నేపథ్యంలో భక్తుల కోసం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సేవల్ని ప్రారంభించింది.మేడారంలో అమ్మవార్లకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించడం ఆనవాయితీ. భక్తులు ఈ బంగారాన్ని పరమపవిత్రంగా భావిస్తారు. అయితే.. వివిధ కారణాల వల్ల మేడారం వెళ్లలేకపోయిన భక్తులకు టీజీఎస్ ఆర్టీసీ తీపి కబురు చెప్పింది. అలాంటి వారికి అమ్మవారి బంగారం ప్రసాదాన్ని తమ ఇంటి వద్దకే చేర్చేందుకు తగు ప్రణాళికలు సిద్ధం చేసింది. రూ.299 చెల్లిస్తే చాలు వద్దకే మేడారం అమ్మవార్ల ప్రసాదాన్ని తీసుకొచ్చి ఇవ్వనుంది. దేవాదాయ శాఖ సహకారంతో మేడారం అమ్మవార్ల బంగారం ప్రసాదాన్ని ఇంటి వద్దకే పంపించాలని టీజీఎస్ ఆర్టీసీ భావించింది. ఈ ప్రసాదం ప్యాకెట్‌లో సమ్మక్క, సారలమ్మ దేవతల ఫోటోతో సహా బెల్లం, పసుపు కుంకుమ వంటివి ఉంటాయి. ఈ గారం ప్రసాదం ప్యాకెట్ పొందాలనుకునే భక్తులు కేవలం రూ.299/- చెల్లించాల్సి ఉంటుంది. www.tgsrtclogistics.co.in వెబ్‌సైట్‌లో లాగిన్ కావడం ద్వారా లేదంటే తమ సమీపంలోని టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్లలో అమ్మవార్ల బంగారం ప్రసాదాన్ని బుక్ చేసుకోవచ్చు. మరింత సమాచారం కోసం టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ను 040-69440069, 040-23450033 నంబర్లలో సంప్రదించవచ్చు అని టీజీఎస్ఆర్టీసీ వీసీ, ఎండీ వై.నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# పల్లెల్లో సంక్రాంతి క్రీడా సంబరాలు

- విజేతలకు బహుమతులు అందజేత




**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్ ఆధ్వర్యంలో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వర్షకొండ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సీనియర్, జూనియర్, ముగ్గుల పోటీల్లో మహిళలు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు సర్పంచ్ వెంకట్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం గ్రామ స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించగా ఏడు జట్లు పోటీపడ్డాయి. ఫైనల్‌లో ప్రథమ బహుమతి దోస పవన్ టీమ్, ద్వితీయ బహుమతి ఎర్రవోయిన హృతిక్ టీమ్, తృతీయ బహుమతి తాండ్ర నరేష్ టీమ్ దక్కించుకున్నాయి. విజేతలకు సర్పంచ్ బహుమతులు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. యువత డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి దుష్ప్రవర్తనలకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. ముగ్గుల పోటీల ద్వారా సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుమ్మల జయ నర్సయ్య, వార్డు సభ్యులు, కార్యదర్శి ప్రవీణ్, ఐకేపీ సీసీ పురుషోత్తం, నాయకులు శివకుమార్, తోకల శేఖర్, రాజేందర్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ కాలువల్లో పిచ్చి మొక్కల తొలగింపు

- సొంత ఖర్చులతో శుభ్రం చేయించిన సర్పంచ్
- హర్షం వ్యక్తం చేసిన రైతులు



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ ఉపకాలువలు పూర్తిగా ముళ్ల పొదలతో నిండిపోవడంతో ఆయకట్టు చివరి భూములకు నీరు అందడం లేదని రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని తెలుసుకున్న నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ చింతల ఉమా రవిపాల్ వెంటనే స్పందించి, సొంత ఖర్చులతో కాలువల్లోని పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించే పనులు చేపట్టారు. గతేడాది చివరి ఆయకట్టు వరకు నీరు అందుతుందని చెప్పడంతో రైతులు అప్పులు చేసి విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేయగా, కాలువల ద్వారా నీరు అందక పంటలు ఎండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సారెస్పీ ఉపకాలువలను సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించి, పూడిక, ముళ్లపొదలను తొలగిస్తేనే రైతులకు సకాలంలో సాగునీరు అందుతుందని వారు కోరుతున్నారు. లేకపోతే వారబంది విధానంలో వచ్చే నీరు చివరి భూములకు చేరక పంటలు నష్టపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల పంట పొలాలకు నీరు అందించాలనే లక్ష్యంతో నూతన సర్పంచ్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రైతులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ చింతల ఉమా రవిపాల్‌తో పాటు అబ్బు రాజు, సతీష్, కూతురు మల్లయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బియ్యం వితరణ



**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన రామంచ ముత్యాలమ్మ అనారోగ్య కారణాలతో ఇటీవల మృతిచెందారు. పేద మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఆమె కుటుంబాన్ని ఆదుకునే ఉద్దేశంతో మాజీ ఎంపీటీసీ మాట్ల వెంకటేశ్వర్లు తన వంతు సహాయంగా 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, భవిష్యత్తులో అవసరమైనప్పుడు తన శక్తి మేర సహాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవయ్య, సమ్మయ్య, శ్రీధర్, శ్రీపాల్, యువరాజ్, ప్రసాద్, యాదగిరి, రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కాసిపేట మండలంలో నేడు విద్యుత్ అంతరాయం

**వేద న్యూస్, కాసిపేట :**

కాసిపేట మండలంలోని అన్ని గ్రామాలకు నేడు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. 132 కేవీ బెల్లంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 33 కేవీ కొండాపూర్ ఫీడర్‌లో మరమ్మత్తు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ సమయంలో వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని అధికారులు కోరారు. ఈ వివరాలను డివిజనల్ ఇంజినీర్ బెల్లంపల్లి ఏ. రాజేశం, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ కె. శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్. స్వర్ణలత వెల్లడించారు.

# రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం



**వేద న్యూస్, కాసిపేట:**

శుక్రవారం కాసిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై 'అరైవ్ అలైవ్' పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాసిపేట ఎస్సై ఆంజనేయులు, ఎంఆర్వో సునీల్ దేశ్ పాండే, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో సప్దర్ అలీ ఖాన్ తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ క్షేమంగా గమ్యస్థానానికి చేరుకోవడమే 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులు, సిబ్బందికి విస్తృతంగా అవగాహన కల్పించారు.

వేద న్యూస్
శనివారం జనవరి 17, 2026

# ధనుష్ ప్రేమకథకు ఓటీటీ వెలుగు..



**వేద న్యూస్ డెస్క్:**

ధనుష్ హీరోగా, కృతి సనన్ హీరోయిన్‌గా నటించిన హృద్యమైన ప్రేమకథ చిత్రం 'తేరే ఇష్క్ మే' త్వరలో ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. గత ఏడాది నవంబర్‌లో థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం కథ, నటన, సంగీతంతో ప్రేక్షకుల మనసులు గెలుచుకుంది. భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కూడా మంచి విజయాన్ని నమోదు చేసింది. థియేటర్ ప్రదర్శన పూర్తికావడంతో ఇప్పుడు డిజిటల్ వేదికపైకి అడుగుపెట్టనుంది. జనవరి 23 నుంచి ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుందని సమాచారం. థియేటర్లలో చూడలేకపోయిన ప్రేక్షకులు, మరోసారి ఆస్వాదించాలనుకునే అభిమానులు ఈ వార్తతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ధనుష్ నటనలోని సహజత్వం, కృతి సనన్ అందించిన భావోద్వేగ ప్రదర్శన సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. హృద్యమైన పాటలు, మృదువైన సంగీతం కథకు మరింత లోతు ఇచ్చాయి. ఓటీటీ విడుదలతో ఈ చిత్రం మరింత విస్తృతమైన ప్రేక్షక లోకానికి చేరుతుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రేమ, అనుభూతులు, సంబంధాల విలువను ఆవిష్కరించే ఈ సినిమా డిజిటల్ ప్రేక్షకులను కూడా అదే స్థాయిలో ఆకట్టుకుంటుందన్న నమ్మకం వ్యక్తమవుతోంది.

# 'మన శంకర వరప్రసాద్ గారు' నాలుగు రోజుల్లో రికార్డు దూకుడు..


## – రూ.190 కోట్ల వసూళ్లతో సంక్రాంతి విజయం..!

**వేద న్యూస్ డెస్క్:**



మెగాస్టార్ చిరంజీవి నటించిన తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయంతో దూసుకుపోతోంది. జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా కేవలం నాలుగు రోజుల్లోనే రూ.190 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సంక్రాంతి పండుగ సీజన్‌లో మరో భారీ హిట్‌ను చిరంజీవి ఖాతాలో వేసుకున్నారని సినీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ యాక్షన్ వినోదాత్మక చిత్రంలో నయనతార కథానాయికగా నటించగా, విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో మెప్పించారు. కథ, వినోదం, భావోద్వేగాల సమ్మేళనం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. తొలి షో నుంచే సానుకూల స్పందన రావడంతో థియేటర్లకు ప్రేక్షకుల రాక భారీగా పెరిగింది. ప్రత్యేకంగా కుటుంబ ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో సినిమా చూసేందుకు వస్తుండటం కలెక్షన్లకు మరింత ఊపునిస్తోంది. ఉదయం నుంచి రాత్రివరకు హౌస్ ఫుల్ ప్రదర్శనలు కొనసాగుతుండగా, టికెట్ కౌంటర్ల వద్ద సందడి కనిపిస్తోంది. ట్రేడ్ వర్గాల అంచనా ప్రకారం ఈ రోజు ముగిసేలోపే సినిమా రూ.200 కోట్ల మార్క్‌ను దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చిరంజీవి ఎనర్జీ, కామెడీ టైమింగ్, భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. పాటలు, నేపథ్య సంగీతం కూడా సినిమాకు బలంగా మారాయి. సంక్రాంతి సెలవుల ప్రభావంతో వచ్చే కొన్ని రోజులు కూడా కలెక్షన్లు స్థిరంగా కొనసాగుతాయని విశ్లేషకులు చెబుతున్నారు. మొత్తం మీద 'మన శంకర వరప్రసాద్ గారు' మెగాస్టార్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తూ, బాక్సాఫీస్‌పై తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది.


# బాక్సాఫీస్‌పై ధురంధర్ సునామీ..




**వేద న్యూస్ డెస్క్:**

రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన గూఢచారి యాక్షన్ చిత్రం ధురంధర్ థియేటర్లలో తన జోరును ఏమాత్రం తగ్గించలేదు. విడుదలై 6 వారాలు పూర్తయినా రోజుకో కొత్త రికార్డును నమోదు చేస్తూ సినీ పరిశ్రమను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ముఖ్యంగా విడుదలైన 42వ రోజున కూడా భారీ వసూళ్లు రాబట్టి అరుదైన ఘనతను అందుకుంది. భారతీయ చిత్రాల చరిత్రలో 42వ రోజున అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ధురంధర్ నిలిచింది. జనవరి 15న ఒక్కరోజులోనే సుమారు 3 కోట్ల నికర వసూళ్లు సాధించింది. ఇంతకుముందు ఈ రికార్డు 1.35 కోట్లుగా ఉండగా దానిని భారీ తేడాతో ధురంధర్ అధిగమించింది. మొదటి రోజే 28 కోట్లతో ప్రారంభమైన ఈ చిత్రం తొలి 3 రోజుల్లోనే 100 కోట్ల మార్కును దాటింది. తొలి వారం ముగిసే సరికి 207 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. రెండో వారం కూడా అదే ఊపును కొనసాగిస్తూ మరో 250 కోట్లకు పైగా రాబట్టింది. మూడో వారం 172 కోట్లకు పైగా, నాలుగో వారం 106 కోట్లకు పైగా వసూలు చేసి తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. ఐదో, ఆరవ వారాల్లో కొత్త సినిమాల పోటీ ఉన్నప్పటికీ రోజుకు 2 నుంచి 3 కోట్ల మధ్య వసూళ్లు సాధించడం విశేషం.

# ప్రశాంత్ నీల్ యూనివర్స్‌లో అనిల్ కపూర్ సంచలనం..



**వేద న్యూస్ డెస్క్:**

మ్యాన్ ఆఫ్ మాసెస్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా, పాన్ ఇండియా దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం డ్రాగన్ ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలను పెంచుకుంటోంది. కేజీఎఫ్, సలార్ వంటి సూపర్ హిట్ చిత్రాల తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో ఈ సినిమాపై సినీ వర్గాల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ చిత్రంలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారనే వార్తలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ఇటీవల యానిమల్ చిత్రంలో రణబీర్ కపూర్ తండ్రిగా అనిల్ కపూర్ చేసిన పాత్రకు ప్రేక్షకుల నుంచి భారీ ప్రశంసలు లభించాయి. వయస్సు పెరిగినా తన నటనా ప్రతిభలో ఎలాంటి తగ్గుదల లేకుండా పవర్‌ఫుల్ పాత్రలతో మెప్పిస్తున్న అనిల్ కపూర్ ఇప్పుడు డ్రాగన్‌లో కూడా అంతే బలమైన క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. అధికారికంగా పాత్ర వివరాలు బయటకు రాకపోయినా, అనిల్ కపూర్ సోషల్ మీడియాలో షేర్ చేసిన సందేశాలు ఈ వార్తలకు బలం చేకూర్చుతున్నాయి. డ్రాగన్ చిత్రం అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల జాబితాలో చోటు దక్కిన విషయాన్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించడం అభిమానుల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రశాంత్ నీల్ సినిమాల్లో సీనియర్ నటుల పాత్రలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందన్న విషయం తెలిసిందే. కేజీఎఫ్‌లో సంజయ్ దత్‌ను భీకరమైన విలన్‌గా చూపించడం, సలార్‌లో జగపతి బాబు, పృథ్వీరాజ్ పాత్రలను కథకు కీలకంగా మలచడం ప్రేక్షకులకు బాగా గుర్తుంది. అదే తరహాలో డ్రాగన్‌లో అనిల్ కపూర్ పాత్ర కూడా కథను మలుపు తిప్పే స్థాయిలో ఉంటుందనే అంచనాలు బలంగా ఉన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. భారీ యాక్షన్ సన్నివేశాలు, బలమైన భావోద్వేగాలు, పవర్‌ఫుల్ పాత్రలతో డ్రాగన్ ప్రేక్షకులకు ఓ మాస్ విజువల్ ట్రీట్‌గా నిలవబోతుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అనిల్ కపూర్ లాంటి సీనియర్ స్టార్ జతకావడంతో ఈ ప్రాజెక్ట్‌పై క్రేజ్ మరింత పెరిగింది. త్వరలోనే ఈ పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉందని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రోహిత్ కెప్టెన్సీ పోవడానికి కారణం అతనే

**వేద న్యూస్ డెస్క్:**




భారత క్రికెట్ అభిమానులను మరోసారి ఆశ్చర్యానికి గురిచేస్తూ రోహిత్ శర్మ కెప్టెన్సీ తొలగింపు వ్యవహారం మళ్లీ చర్చకు వచ్చింది. ఛాంపియన్స్ ట్రోఫీని భారత్‌కు అందించినప్పటికీ రోహిత్‌ను వన్డే కెప్టెన్సీ నుంచి తప్పించడం వెనుక పెద్ద రాజకీయాలే ఉన్నాయంటూ మాజీ క్రికెటర్ మనోజ్ తివారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ నిర్ణయం వెనుక ప్రధానంగా జట్టు ప్రధాన కోచ్ పాత్ర ఉందని ఆయన పరోక్షంగా ఆరోపించారు. ఓ క్రీడా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మనోజ్ తివారి మాట్లాడుతూ.. రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తొలగించడానికి అసలు కారణం ఏమిటో బయటకు స్పష్టంగా తెలియకపోయినా, తెర వెనుక కీలక నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. ఎంపిక కమిటీ అధినేతకు నిర్ణయాలు తీసుకునే ధైర్యం ఉన్నప్పటికీ, ఇలాంటి పెద్ద మార్పుల్లో కోచ్ సూచనలు తప్పకుండా ప్రభావం చూపుతాయని చెప్పారు. బయటకు కనిపించేది ఒక నిర్ణయమే అయినా, లోపల మాత్రం చాలా విషయాలు నడుస్తాయని తివారి వ్యాఖ్యానించారు. టీమిండియాకు ప్రపంచ స్థాయి విజయాలు అందించిన కెప్టెన్‌ను ఇలా పక్కన పెట్టడం తనకు అస్సలు అర్థం కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మూడు సార్లు డబుల్ సెంచరీలు సాధించిన ఆటగాడు, జట్టు కోసం నిస్వార్థంగా ఆడే నాయకుడిపై అనుమానం వ్యక్తం చేయడం సరైంది కాదన్నారు. ఒకరి భుజంపై తుపాకీ పెట్టి మరొకరు కాల్చినట్లుగా ఈ వ్యవహారం కనిపిస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ నిర్ణయం వల్ల తనకు వన్డే క్రికెట్ చూడాలనే ఆసక్తి కూడా తగ్గిపోయిందని తివారి తెలిపారు. జట్టు మేనేజ్‌మెంట్ తీసుకుంటున్న నిర్ణయాలు అభిమానుల్లో గందరగోళాన్ని పెంచుతున్నాయని, భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు భారత క్రికెట్‌పై ప్రభావం చూపే అవకాశముందని ఆయన హెచ్చరించారు. రోహిత్ అభిమానులు ఇప్పటికే ఈ అంశంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా, తివారి వ్యాఖ్యలతో ఈ వివాదం మరింత వేడెక్కింది.

# మెర్సిడెస్ మేబ్యాక్ జీఎల్ఎస్ విడుదల




**వేద న్యూస్ డెస్క్:**

మెర్సిడెస్ బెంజ్ సంస్థ తన లగ్జరీ వాహనం మేబ్యాక్ జీఎల్ఎస్‌ను భారత దేశంలో స్థానికంగా అసెంబుల్ చేసి మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ మోడల్ ధరను రూ. 2.75 కోట్లుగా ప్రకటించింది. గతంలో పూర్తిగా దిగుమతి చేసిన వాహనం ధర రూ. 3.17 కోట్లుగా ఉండేది. స్థానిక అసెంబ్లీ వల్ల దిగుమతి పన్నులు తగ్గడంతో దాదాపు రూ. 42 లక్షల వరకు ధర తగ్గినట్లు కంపెనీ తెలిపింది. అదే విధంగా రూ. 4.10 కోట్ల ధరతో ప్రత్యేక ఎడిషన్‌ను కూడా విడుదల చేసింది. స్థానికంగా తయారీ జరగడం వల్ల వినియోగదారులకు వాహనం త్వరగా అందుబాటులోకి వస్తుందని, బుకింగ్ చేసిన వారికి వేగంగా డెలివరీ చేయడం సాధ్యమవుతుందని సంస్థ పేర్కొంది. వాహనం డిజైన్ పరంగా ఆకర్షణీయంగా రూపొందించారు. ముందు భాగంలో మెరిసే గ్రిల్, ఆధునిక లైట్లు, క్రోమ్ ఫినిష్ ప్రత్యేకంగా కనిపిస్తాయి. వైపులా పెద్ద అల్లాయ్ చక్రాలు, వెనుక భాగంలో స్టైలిష్ లైట్లు ఉన్నాయి. మొత్తం లయౌట్ ప్రీమియం లుక్‌ను అందిస్తోంది. లోపలి భాగంలో విశాలమైన కేబిన్, పెద్ద డిస్‌ప్లే స్క్రీన్లు, లెదర్ సీట్లు, ముందు వెనుక సీట్లకు సౌకర్యవంతమైన ఆర్మ్‌రెస్టులు ఏర్పాటు చేశారు. వెనుక సీట్ల ప్రయాణికుల కోసం ప్రత్యేక డిస్‌ప్లేలు, వైర్‌లెస్ ఛార్జింగ్ సదుపాయం, పెద్ద సన్‌రూఫ్, బహుళ ఉష్ణోగ్రత నియంత్రణ వ్యవస్థ, అధిక నాణ్యత గల ఆడియో వ్యవస్థ, శీతలీకరణ కంపార్ట్‌మెంట్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. భద్రత పరంగా ఈ వాహనంలో చుట్టూ కనిపించే కెమెరా వ్యవస్థ, స్వయంచాలక పార్కింగ్ సహాయం, టైర్ ఒత్తిడి పరిశీలన, ఆధునిక డ్రైవర్ సహాయ సాంకేతికత వంటి ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి. ఇంజిన్ సామర్థ్యం విషయానికి వస్తే శక్తివంతమైన ఇంజిన్‌తో పాటు మైల్డ్ హైబ్రిడ్ సహాయం ఉండటంతో వేగవంతమైన పనితీరు లభిస్తోంది. ఈ వాహనం కేవలం 4.9 సెకన్లలో 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదని కంపెనీ వెల్లడించింది. గరిష్ఠ వేగం గంటకు 250 కిలోమీటర్లు. ధర తగ్గడంతో పాటు అధునాతన ఫీచర్లు అందుబాటులోకి రావడంతో లగ్జరీ వాహనాల కొనుగోలుదారుల్లో ఈ మోడల్‌పై భారీ ఆసక్తి నెలకొంది.


# చిన్నస్వామిలో కృత్రిమ మేధ కెమెరాలు..




**వేద న్యూస్ డెస్క్:**

ఒకప్పుడు మ్యాచ్‌లతో కోలాహలంగా కనిపించిన చిన్నస్వామి స్టేడియానికి పూర్వ వైభవం తీసుకురావాలని కర్నాటక క్రికెట్ సంఘం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. స్టేడియంలో భద్రతను మరింత బలోపేతం చేసి మళ్లీ మ్యాచ్‌ల నిర్వహణకు అనుమతి పొందాలనే లక్ష్యంతో కొత్త ప్రణాళికలను అమలు చేయడానికి సిద్ధమవుతోంది. ఈ క్రమంలో అభిమానుల రద్దీని నియంత్రించేందుకు, ప్రమాదాలు జరగకుండా చూడేందుకు కృత్రిమ మేధతో పనిచేసే ఆధునిక కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గత సంవత్సరం జూన్ 4న జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందడంతో స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణపై నిషేధం విధించారు. భద్రతాపరమైన లోపాల కారణంగా అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో అప్పటి నుంచి అక్కడ ఒక్క మ్యాచ్ కూడా జరగలేదు. ఇటీవల జరిగిన దేశీయ టోర్నీలకు కూడా ఈ మైదానం అవకాశం దక్కలేదు. ఈ నేపథ్యంలో కొత్త కార్యవర్గం భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టింది. తొక్కిసలాట ఘటనపై విచారణ చేసిన ఏకసభ్య కమిషన్, ముందుగా ప్రేక్షకుల భద్రతకు పక్కా చర్యలు తీసుకోవాలని సూచించింది. అందులో భాగంగా స్టేడియం మొత్తం 300 నుంచి 350 కృత్రిమ మేధ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కెమెరాల ద్వారా ప్రేక్షకుల కదలికలను పర్యవేక్షించి తోపులాటలు జరగకుండా నియంత్రించడంతో పాటు, లోపలికి ప్రవేశించే సమయంలో, బయటకు వెళ్లే సమయంలో క్యూలు సక్రమంగా కొనసాగించేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ మొత్తం వ్యవస్థ ఏర్పాటు కోసం సుమారు రూ.4.5 కోట్లు ఖర్చు చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. భద్రతా ప్రమాణాలు పూర్తిగా అమలయ్యాక మాత్రమే మ్యాచ్‌లకు అనుమతి లభిస్తుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. త్వరలోనే సంబంధిత సంఘం నుంచి తుది నిర్ణయం వెలువడనుంది. అనుమతి లభిస్తే చిన్నస్వామి మళ్లీ ప్రేక్షకులతో కళకళలాడనుంది. అనుమతి రాకపోతే ఇతర నగరాల్లో మ్యాచ్‌లు నిర్వహించే అవకాశాలపై ఆలోచన జరుగుతోంది.

# గ్యాడ్జెట్ ప్రియులకు బిగ్ అలర్ట్..



**వేద న్యూస్ డెస్క్:**

రాబోయే రెండు మూడు నెలల్లో స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, టీవీల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మెమరీ చిప్‌ల కొరత ఏర్పడటం, అధిక పనితీరు అవసరమయ్యే ఆధునిక సాంకేతిక వినియోగం పెరగడం ఇందుకు ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నారు. ఇప్పటికే గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో గాడ్జెట్‌ల ధరలు సుమారు 21 శాతం వరకు పెరిగాయి. ఇప్పుడు మరోసారి 4 నుంచి 8 శాతం వరకు పెరుగుదల ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. టెలివిజన్లపై పన్ను తగ్గించినప్పటికీ, స్మార్ట్‌ఫోన్‌లు మరియు ల్యాప్‌టాప్‌లపై పన్నుల్లో మార్పులు లేవు. అయినప్పటికీ ఉత్పత్తి ఖర్చులు పెరగడం వల్ల వినియోగదారులపై భారం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మెమరీ చిప్‌ల తయారీ తగ్గడంతో వాటి ధరలు పెరుగుతున్నాయని, దీని ప్రభావం అన్ని ఎలక్ట్రానిక్ పరికరాలపై పడుతోందని నిపుణులు చెబుతున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073